క్లుప్తంగా...

ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఒవైసీకి జ్ఞాపిక అందజేత



అక్బరుద్దీన్ ఒవైసీకి జ్ఞాపిక అందజేస్తున్న సమద్ బిన్ అబ్దాద్

చాంద్రాయణగుట్ట: రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని మజ్లిస్ శాసనసభ పక్ష నేత, చాంద్రాయణగుట్ట ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఒవైసీకి ఉప్పుగూడ డివిజన్ మాజీ కార్పొరేటర్ సమద్ బిన్ అబ్దాద్ మక్కా జ్ఞాపిక అందజేశారు. రంజాన్ పండుగను పురస్కరించుకుని ఆదివారం బండ్లగూడలోని కార్యాలయంలో ఎమ్మెల్యేను కలిసి ఈద్ ముబారక్ తెలిపారు. కార్యక్రమంలో మజ్లిస్ సీనియర్ నాయకులు వర్కల నాగరాజు, పి.బాబు, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

సత్కారం



హోంమంత్రి మహమూద్ అలీకి రంజాన్ శుభాకాంక్షలు తెలుపుతున్న శాంతిదేవి

అబిడ్స్: రాష్ట్ర హోంమంత్రి మహమూద్ అలీని గోషామహల్ నియోజకవర్గ బీఆర్ఎస్ నాయకురాలు శాంతిదేవి కలిసి రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన శాంతిదేవిని శాలువాతో సత్కరించారు. అనంతరం మహమూద్ అలీ మాట్లాడుతూ.....రాష్ట్రంలోని అన్ని మతాల పండుగలను ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రభుత్వం స్వయంగా నిర్వహిస్తున్నదన్నారు. కేసీఆర్ ప్రభుత్వ సంక్షేమ పథకాలను పలు రాష్ట్రాలు ఆదర్శంగా తీసుకోవడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో రామ్‌రాజ్ ముదిరాజ్, ప్రేమ్ అగర్వాల్ పాల్గొన్నారు.

శుభాకాంక్షలు



హోం మంత్రిని సన్మానిస్తున్న తిరుపతి నాగరాజు

చాంద్రాయణగుట్ట: రంజాన్ పండుగను పురస్కరించుకుని అలియాబాద్ సీనియర్ బీఆర్ఎస్ నాయకుడు తిరుపతి నాగరాజు హోం మంత్రి మహమూద్ అలీకి రంజాన్ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ మేరకు ఆదివారం ఆయన కార్యాలయంలో కలిసి శాలువా కప్పి ఈద్ ముబారక్ తెలిపారు.

ఎంపీ, ఎమ్మెల్యేకు రంజాన్ శుభాకాంక్షలు

చార్మినార్: రంజాన్ పండుగ సందర్భంగా మజ్లిస్ పార్టీ ఆమన్‌నగర్–బీ అధ్యక్షులు మహమ్మద్ మోహీనుద్దీన్ పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఆదివారం మజ్లిస్ పార్టీ అధినేత, ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ, చార్మినార్ ఎమ్మెల్యే మహ్మద్ ముంతాజ్ అహ్మద్ ఖాన్‌లకు శుభాకాంక్షలు తెలియజేశారు.

ఈద్ ముబారక్



సలావుద్దీన్ లోధీకి శుభాకాంక్షలు తెలియజేస్తున్న పుప్పాల రాధాక్రిష్ణ

చార్మినార్: మొగల్‌పురా డివిజన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు పుప్పాల రాధాక్రిష్ణ ఆదివారం బీఆర్ఎస్ చార్మినార్ నియోజక వర్గ ఇన్‌చార్జి మహ్మద్ సలావుద్దీన్ లోధీకి రంజాన్ ఈద్ ముబారక్ తెలిపారు. శాలువా కప్పి బొకే అందజేసి పూల మాలలతో సత్కరించారు.

హోరాహోరీగా 15వ డిస్ట్రిక్ లెవల్ కిక్ బాక్సింగ్ పోటీలు

జియాగూడ: హైదరాబాద్ డిస్ట్రిక్ లెవల్ కిక్‌బాక్సింగ్ పోటీలు ఆదివారం జియాగూడలోని భారత అభ్యుదయ ఉన్నత పాఠశాలల్లో హోరాహోరీగా జరిగాయి. ఈ పోటీల్లో గెలుపొందిన వారు ఈ నెల 29, 30ల్లో ఆదిలాబాద్‌లో నిర్వహించనున్న కిక్‌బాక్సింగ్ పోటీలలో పాల్గొంటారని అధ్యక్షుడు కె.కమల్‌పర్షద్, ప్రధాన కార్యదర్శి ఎంకే బాలాజీ తెలిపారు. గెలుపొందిన క్రీడాకారులకు వారు ప్రశంసా పత్రాలు, మెడల్స్‌ను బహుకరించారు. కార్యక్రమంలో జీహెచ్ఎంసీ స్పోర్ట్స్ డైరెక్టర్ బాషా, ఖైరతాబాద్ జోన్ గేమ్స్ ఇన్‌స్పెక్టర్ పి.మాధవి తదితరులు పాల్గొన్నారు.

సమస్యల సత్వర పరిష్కారం

- ప్రజలకు అందుబాటులో అధికారులు..
- సమస్యల పరిష్కారానికి నిరంతర కృషి
- స్పందించని అధికారులపై శాఖాపరమైన చర్యలు
- 'సాక్షి'తో జీహెచ్ఎంసీ చార్మినార్ జోనల్ కమిషనర్ సామ్రాట్ అశోక్

చార్మినార్: ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు ఆయా సర్కిళ్ల డిప్యూటీ కమిషనర్లు, ఇతర సిబ్బంది కార్యాలయాల్లో ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉంటారని జీహెచ్ఎంసీ చార్మినార్ జోనల్ కమిషనర్ సామ్రాట్ అశోక్ అన్నారు. ప్రజా సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా నిర్ణీత సమయంలో ఆయా సమస్యలపై అధికారులు ఎప్పటికప్పుడు తగిన చర్యలు తీసుకుని పరిష్కారానికి కృషి చేయాలన్నారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం పనికి రాదన్నారు. ఎవరైనా ప్రజా ఫిర్యాదుల పట్ల వెంటనే స్పందించకపోతే శాఖాపరమైన చర్యలు తప్పవన్నారు. ఎక్కడ ఎలాంటి అసౌకర్యం కలగకుండా ప్రణాళికాబద్ధంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. శిథిల భవనాల పట్ల అప్రమత్తంగా ఉండాలని టౌన్ ప్లానింగ్, ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించామన్నారు. సమస్యల పరిష్కారానికి తీసుకుంటున్న చర్యలపై జీహెచ్ఎంసీ జోనల్ కమిషనర్‌తో 'సాక్షి' ముఖాముఖి



ప్రశ్న: కొందరు అధికారులు తమ కార్యాలయాల్లో అందుబాటులో ఉండడం లేదనే ఫిర్యాదులున్నాయి..దీనిపై మీరు తీసుకుంటున్న చర్యలేమిటి..?

జవాబు: క్షేత్ర స్థాయి పరిశీలన ఉన్నప్పుడు మాత్రమే ఆయా విభాగాల అధికారులు అందుబాటులో ఉండకపోవచ్చు..

ప్రశ్న: ఫిర్యాదులపై స్పందించని అధికారులపై ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు.?

జవాబు:ఎప్పుడు..ఎక్కడ..ఎలాంటి సమస్యలు పెండింగ్‌లో ఉన్నాయో నా దృష్టికి తీసుకువస్తే..వెంటనే పరిష్కరిస్తాం..

ప్రశ్న: చార్మినార్ జోన్ పరిధిలో ఓపెన్ నాలాల పరిస్థితి ఏమిటి..?

జవాబు: గ్రేటర్ కమిషనర్ ఆదేశాల మేరకు రెండేళ్ల క్రితం పలు ప్రాంతాల్లోని ఓపెన్ నాలాల విస్తరణ పనులు చేపట్టాం. విస్తరణలో భాగంగా స్థల, గృహ యజమానులకు నష్టపరిహారాన్ని చెల్లించినప్పటికీ అక్కడక్కడ కొన్ని సాంకేతిక సమస్యల కారణంగా పనుల్లో జాప్యం జరుగుతోంది. ప్రస్తుత వర్షాకాలం నాటికి నాలాల విస్తరణ పనులను పూర్తి చేయడంతో పాటు పూడికతీత పనులన్నింటిని వేగవంతం చేస్తాం. సాధ్యమైనంత త్వరగా పనులు పూర్తి చేస్తే...లోతట్టు ప్రాంతాల ప్రజలకు కలిగే ఇబ్బందులను దూరం చేయవచ్చును.

ప్రశ్న: పూడిక తీత పనులు ఎలా..?

జవాబు:ప్రధాన ఓపెన్ నాలాలతో పాటు క్లోజ్‌డ్ వరదనీటి నాలాల్లో కూడా పూడిక తీత పనులు చేపట్టనున్నాం.

ప్రశ్న: కూలడానికి సిద్ధంగా ఉన్న శిథిల భవనాల పరిస్థితి ఏమిటి..? గతంలో భారీ వర్షాలకు పురాతన భవనాలు నేలకూలి ప్రాణ నష్టం సంభవించింది. వీటిపై ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు..?

జవాబు:శిథిలావస్థకు చేరిన పురాతన భవనాల పట్ల అధికారులు, సిబ్బందిని అప్రమత్తంగా ఉండాలని ఆదేశాలు జారీ చేస్తున్నాం. వేసవి కాలంలోనే పాత భవనాలను గుర్తించి వాటి యజమానులకు నోటీసులను జారీ చేస్తున్నాం. ఇప్పటికే టౌన్ ప్లానింగ్, ఇంజినీరింగ్ అధికారులు అదే పనిలో ఉన్నారు.

ప్రశ్న: నోటీసులను పట్టించుకోకపోతే..?

జవాబు: పురాతన భవనాల మరమ్మతులు చేయని వారిని కట్టడి చేయాలని కోరాం. నోటీసులు జారీ చేసిన గృహ యజమానులను మరోసారి అలెర్ట్ చేసి వినకపోతే సదరు భవనాలను వెంటనే కూల్చి వేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేస్తాం. ఈ విషయంలో ఆయా ప్రాంతాల నుంచి అందే ఫిర్యాదులలు, కూలడానికి సిద్ధంగా ఉండే భవనాలతో స్థానికులకు ప్రమాదం పొంచి ఉందనే విషయాన్ని యజమానులకు వివరించి తగిన చర్యలు తీసుకుంటాం.

సనాతన ధర్మానికి సంపద కళలు



నృత్య కళాకారులతో వకులాభరణం కృష్ణమోహన్‌రావు తదితరులు

గన్‌ఫౌండ్రీ: సనాతన ధర్మానికి సంపద శాస్త్రీయ సంగీత కళలేనని తెలంగాణ రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ వకులాభరణం కృష్ణమోహన్‌రావు అన్నారు. ఆదివారం బొగ్గులకుంటలోని తెలంగాణ సారస్వత పరిషత్‌లో శ్రీకర కూచిపూడి ఆర్ట్స్ అకాడమి ఆధ్వర్యంలో పలువురు నృత్య కళాకారులకు బాల నృత్య నంది పురస్కారాలను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.... తెలంగాణ రాష్ట్రం కళలను నిలయమన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ కళలు, కళాకారులకు ప్రాధాన్యం ఇస్తున్నారని ఇది యావత్ కళాకారులకు సంతోషించదగ్గ విషయమన్నారు. అంతకు ముందు చిన్నారుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో సరస్వతి ఉపాసకులు దైవజ్ఞశర్మ, జబర్దస్త్ నటుడు మురళి, సినీ నటుడు లక్ష్మీనారాయణ, కూచిపూడి నృత్యగురువు కనకదుర్గ, సంస్థ అధ్యక్షురాలు సుమేధా జోషి తదితరులు పాల్గొన్నారు.

జెండా పండుగను ఘనంగా నిర్వహిద్దాం



సమావేశంలో పాల్గొన్న మహ్మద్ సలావుద్దీన్ లోథీ తదితరులు

చార్మినార్: బీఆర్ఎస్ పార్టీ అధిష్టానం పిలుపు మేరకు ఈ నెల 25న నియోజక వర్గంలోని అన్ని డివిజన్లలో జెండా పండుగను ఘనంగా నిర్వహించేందుకు తగిన ఏర్పాట్లు చేయాలని పార్టీ చార్మినార్ నియోజక వర్గ ఇన్‌చార్జి మహ్మద్ సలావుద్దీన్ లోధీ అన్నారు. ఆదివారం పురానీహవేలీలోని పార్టీ కార్యాలయంలో జరిగిన డివిజన్ స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడుతూ...జెండా పండుగ అనంతరం ఆజంపురాలోని ఆజం ఫంక్షన్ హాల్‌లో హోం శాఖ మంత్రి మహ్మద్ మహమూద్ అలీ నేతృత్వంలో జరగనున్న సమావేశానికి ర్యాలీగా తరలివెళ్లాలన్నారు. ఇందుకోసం డివిజన్లలో పార్టీ జెండాలను ఏర్పాటు చేసి ర్యాలీలు నిర్వహించాలన్నారు. సమావేశంలో నాయకులు పుప్పాల రాధాక్రిష్ణ, రవీశ్వర్, మహ్మద్ అమేర్, మనీష్ అగర్వాల్, సయ్యద్ అహ్మద్, నిమ్మగడ్డ రమేష్, సయ్యద్ సలీం, విజయ్‌కుమార్, తాజుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న డీఈఓ శ్రీనివాస్ రెడ్డి తదితరులు

గన్‌ఫౌండ్రీ: తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో బీపీఎస్ పబ్లికేషన్స్ ఆధ్వర్యంలో రచయిత బద్దిపడగ రమేష్ రచించిన 'విద్యా సాహితీ నౌక' పుస్తకావిష్కరణ సభ ఆదివారం రవీంద్రభారతిలో నిర్వహించారు. ఈ సందర్భంగా సిద్దిపేట డీఈఓ ఇ.శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులుగా విధులు నిర్వహిస్తూ విభిన్నమైన రచనలు చేయడం అభినందనీయమన్నారు. రాబోయే రోజుల్లో మరిన్ని పుస్తకాలను తీసుకురావాలని ఆకాంక్షించారు. సీనియర్ జర్నలిస్ట్ పిట్టల రవీందర్, గెజిటెడ్ హెడ్‌మాస్టర్ అసోసియేషన్ అధ్యక్షులు రాజభాను చంద్రప్రకాష్, సీనియర్ జర్నలిస్ట్ వైద్యుల మధుకర్, సాహితీ బంధువులు, మిత్రులు పాల్గొన్నారు.

నారాయణ స్కూల్‌లో ఘనంగా గ్రాడ్యుయేషన్ డే



పట్టాలు పొందిన విద్యార్థులతో ప్రిన్సిపాల్ నిర్మల

విజయనగర్‌కాలనీ: పాఠశాల జీవితంలో ప్రాథమిక పాఠశాల విద్యాభ్యాసం ముఖ్యమైనదని నారాయణ స్కూల్‌లో ప్రధానోపాధ్యాయురాలు జి.నిర్మల, విద్యావేత్తలు గోపాల్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఆదివారం విజయనగర్‌కాలనీ నారాయణ ఈ టెక్నో పాఠశాలలో గ్రాడ్యుయేషన్ డే ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ చదువుతో పాటు సాంస్కృతిక కార్యక్రమాల్లో ప్రతిభ కనబరుస్తున్న విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందన్నారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. అనంతరం విద్యార్థులకు ప్రశంసాపత్రాలు, మెడల్స్ అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

తెలంగాణ చరిత్రను భావితరాలకు అందించాలి



సమావేశంలో పాల్గొన్న రాక సుధాకర్, విద్యానంద ఆర్య తదితరులు

అబిడ్స్: తెలంగాణ చరిత్రను భావితరాలకు తెలియజెప్పాల్సిన అవసరం ఉందని ప్రముఖ జర్నలిస్ట్ కస్తూరి రాక సుధాకర్ అన్నారు. తెలంగాణ చరిత్ర చెరిపితే చెరిగిపోదన్నారు. నైజాం విముక్త స్వాతంత్ర అమృత మహోత్సవాల్లో భాగంగా బేగంబజార్ కోల్సివాడిలో ప్రముఖ వ్యక్తుల సమ్మేళన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కస్తూరి రాక సుధాకర్ మాట్లాడుతూ తెలంగాణ చరిత్ర ఎంతో అద్భుతమన్నారు. దేశ విదేశాల్లోనూ తెలంగాణకు ప్రత్యేక గుర్తింపు ఉందన్నారు. ఉస్మానియా యూనివర్సిటీ సాంస్కృతిక విభాగం ఆచార్యుడు విద్యానందన ఆర్య మాట్లాడుతూ తెలంగాణ సంస్కృతి పట్ల విద్యార్థులకు అవగాహన కల్పించాలన్నారు. ప్రతి ఒక్కరూ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను చాటేందుకు కృషి చేయాలన్నారు. ప్రాచీన దేశ ఇతిహాసాన్ని వక్రీకరించే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. సమాజాన్ని జాగృతం చేయాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. కార్యక్రమంలో హైదరాబాద్ కిరాణా మర్చంట్ అసోసియేషన్ అధ్యక్షులు దామోదర్ విజయ వర్గీయ తదితరులు పాల్గొన్నారు.

కళలపై ఆసక్తి పెంపొందించాలి

గన్‌ఫౌండ్రీ: చిన్నారులకు పాఠశాల స్థాయినుంచే శాస్త్రీయ సంగీతం, కళలపై మక్కువ కల్పించాలని మున్సిపల్ కమిషనర్ ఎన్. సత్యనారాయణ అన్నారు. ఆదివారం సైఫాబాద్‌లోని కళాభవన్‌లో కూచిపూడి డ్యాన్స్ అకాడమీ 28వ వార్షికోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో సినీ నటి సంధ్య, జబర్దస్త్ నటుడు సుధాకర్, ట్రైనర్ అనుప్రసాద్, సంస్థ వ్యవస్థాపకురాలు డాక్టర్ విమలా నీలం తదితరులు పాల్గొన్నారు.



అవార్డు గ్రహీతలతో ఎస్.సత్యనారాయణ తదితరులు

చైతన్యంతోనే బహుజనులకు రాజ్యాధికారం



మాట్లాడుతున్న బోనాల శ్రీనివాస్

అఫ్జల్‌గంజ్: రాజ్యాధికార సాధనకు బహుజనులను చైతన్యం చేసేందుకు దళిత శక్తి ప్రోగ్రాం రాష్ట్ర అధినేత డాక్టర్ విశారదన్ మహారాజ్ చేపట్టిన 10,000 కిలో మీటర్ల పాదయాత్రకు విశేష స్పందన వస్తుందని ప్రజా ఏక్తా పార్టీ జాతీయ అధ్యక్షుడు బోనాల శ్రీనివాస్ అన్నారు. ఆదివారం పాదయాత్ర గౌలిగూడలోని ఎలగందుల బస్తీ, మహారాజుల కాలనీ వద్ద 9600 కిలో మీటర్ల మైలురాయికి చేరుకున్న సందర్భంగా బస్తీ అధ్యక్షుడు మేకల నారాయణ, నాయకులు మేకల ప్రసాద్, వడ్లూరి లక్ష్మణ్, నర్గీ శివాజీ, వడ్లూరి అశోక్, హర్షవర్ధన్‌తో కలిసి స్వాగతం పలికారు. సమాజం పట్ల విశారదన్ మహారాజ్‌కు ఉన్న నిబద్ధత చూసి ఆకర్షితుడినయ్యానని, ఆయనను స్ఫూర్తిగా తీసుకుని బహుజనుల అభివృద్ధికి కృషి చేస్తానని బోనాల శ్రీనివాస్ పేర్కొన్నారు.

గొప్ప మానవతావాది బసవేశ్వరుడు



బసవేశ్వర విగ్రహానికి నివాళులర్పిస్తున్న నాగ్‌నాథ్

చార్మినార్: కుల వ్యవస్థ, వర్ణ విబేధాలు, లింగ వివక్షను వ్యతిరేకించిన గొప్ప మానవతా వాది శ్రీ మహాత్మ బసవేశ్వరుడని టీఎస్ బసవ కేంద్రం అధ్యక్షులు నాగ్‌నాథ్ మాశెట్టి అన్నారు. శ్రీ మహాత్మ బసవేశ్వరుని 890వ, జయంతోత్సవాలను పురస్కరించుకుని ఆదివారం ఆయన తన కార్యాలయంలో మహాత్మా బసవేశ్వరుని విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...ఈసారి ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నామన్నారు. తెలంగాణలోని కన్నడిగులు తమ సంస్కృతి, సంప్రదాయాలకు అనుగుణంగా ఇక్కడి ప్రజలతో కలసి మెలిసి జీవనం సాగిస్తున్నారన్నారు. అంటరాని తనాన్ని గట్టిగా వ్యతిరేకించిన బసవేశ్వరుడు వీరశైవ ధర్మ ప్రచారం చేశారన్నారు.

హెల్త్ బేబీ షో-2023కు విశేష స్పందన



హెల్త్ బేబీ కిట్లను అందజేస్తున్న బీజేపీ నేత జగన్నాథ రాజు

నాంపల్లి: అటల్ బిహారి వాజ్‌పేయి ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన హెల్త్ బేబీ షో-2023 కార్యక్రమానికి విశేషమైన స్పందన లభిస్తోంది. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి నేతృత్వంలో బీజేపీ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు గౌతమ్ రావు పర్యవేక్షణలో ఆదివారం నాంపల్లి నియోజకవర్గంలో హెల్త్ బేబీ షో నిర్వహించారు. ఈ సందర్భంగా హెల్త్ బేబీ షో-2023 ప్రాముఖ్యతను వివరించి కిట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీజేపీ నేతలు భుజందర్ రావు, జగన్నాధరాజు, పవన్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా చందనోత్సవం



పూజల్లో పాల్గొన్న గాజుల అంజయ్య, చంద్రకళ దంపతులు

చార్మినార్: స్వయంభూ శ్రీ లక్ష్మీ నరసింహస్వామి చందనోత్సవ పూజా కార్యక్రమాలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. మీరాలం మండి శ్రీ మహాంకాళేశ్వర దేవాలయం కమిటీ చైర్మన్ గాజుల అంజయ్య, చంద్రకళ దంపతులు పూజల్లో పాల్గొన్నారు. వేద పండితులు వరప్రసాద్ ఆలయ మర్యాదలతో వారికి ఘనంగా స్వాగతం పలికి సత్కరించారు. అనంతరం చందనోత్సవ సహిత లక్ష్మీ నరసింహ్మ స్వామి హోమం నిర్వహించారు. కార్యక్రమంలో దేవాలయం కమిటీ కార్యదర్శి కాట రమేష్, ప్రముఖ బిల్డర్ కోటి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పాతబస్తీ పర్యాటక ప్రాంతాలు కిటకిట



చార్మినార్‌లో సందర్శకుల సందడి

చార్మినార్: వారాంతం కావడంతో ఆదివారం పాతబస్తీలో పర్యాటకులు సందడి చేశారు. చార్మినార్ కట్టడంతో పాటు మక్కా మసీదు, లాడ్‌బజార్‌లను సందర్శించడానికి పర్యాటకులు అధిక సంఖ్యలో తరలి వచ్చారు. దీంతో పరిసరాల్లో రద్దీ నెలకొంది. నెల రోజుల పాటు కొనసాగిన రంజాన్ మార్కెట్ ముగిసింది. దీంతో ఆదివారం పర్యాటకులు సందడి చేశారు. సాలార్‌జంగ్ మ్యూజియం, హెచ్ఈహెచ్ నిజాం మ్యూజియం, చౌమహల్లా ప్యాలెస్ తదితర పర్యాటక ప్రాంతాలన్నీ సందర్శకులతో కిటకిటలాడాయి. చిరువ్యాపారాలు సైతం జోరుగా కొనసాగాయి.

25 నుంచి తెలంగాణ క్రాస్ బౌ షూటింగ్ చాంపియన్ షిప్



మాట్లాడుతున్న అసోసియేషన్ అధ్యక్షురాలు బి.లక్ష్మీ చైతన్య తదితరులు

సుల్తాన్‌బజార్: తెలంగాణ క్రాస్ బౌ షూటింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఫస్ట్ తెలంగాణ ఓపెన్ స్టేట్ క్రాస్ బౌ చాంపియన్ షిప్ ఈ నెల 25 నుంచి 30 వరకు దోమలగూడలోని గవర్నమెంట్ ఫిజికల్ ఎడ్యుకేషన్ కాలేజీలో నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ అధ్యక్షురాలు బి.లక్ష్మీ చైతన్య తెలిపారు. ఆదివారం హైదర్‌గూడలోని ఎన్ఎస్ఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ.... పిల్లలను క్రీడల్లో రాణించే విధంగా తల్లిదండ్రులు ప్రోత్సహించాలన్నారు. పోటీల ప్రారంభోత్సవ కార్యక్రమానికి మంత్రు శ్రీనివాస్ గౌడ్, తలసాని శ్రీనివాస్ యాదవ్, తెలంగాణ స్టేట్ ఇరిగేషన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ సముద్రాల వేణుగోపాలచారి, శాట్స్ చైర్మన్ ఆంజనేయగౌడ్, ప్రముఖ సినీ నటుడు సుమన్ హాజరుకానున్నట్లు తెలిపారు. తెలంగాణలో మొదటిసారి స్టేట్ క్రాస్ బౌ క్రీడలు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ కే.పద్మ, ప్రధాన కార్యదర్శి వి.వసంత మాధురి, జాయింట్ సెక్రెటరీ బి.భువనేశ్వరి, ట్రెజరర్ బి.ఎం .పవన్ కుమార్, ఎస్ఎస్ జయరాజ్ భానుచందర్, దివ్యరాణి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పరశురామ జయంతి వేడుకలు



పరశురామ జయంతి వేడుకల్లో పాల్గొన్న బీఆర్ఎస్ నాయకులు ఆశీష్‌కుమార్ యాదవ్ తదితరులు

అబిడ్స్: శ్రీ పరశురామ జయంతి వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. బేగంబజార్‌లోని రాజస్థాన్ బ్రాహ్మన్ సమాజ్ ఆధ్వర్యంలో పరశురామ పల్లకీ సేవ నిర్వహించారు. గోషామహల్ నియోజకవర్గ బీఆర్ఎస్ నాయకులు ఆశీష్‌కుమార్ యాదవ్ వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రభుత్వం అన్నివర్గాల పండుగలకు అండగా ఉందన్నారు. ప్రభుత్వమే అన్ని పండుగలను నిర్వహించడం అభినందనీయమన్నారు.

భార్యపై భర్త దాడి

గౌలిపురా: భార్యపై అనుమానం పెంచుకున్న భర్త సుత్తెతో ఆమెపై దాడి చేసి తీవ్రంగా గాయపరిచిన సంఘటన ఆదివారం మొఘల్‌పురా పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ ఎ.శివ కుమార్ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి.. బాలాగంజ్ ప్రాంతంలో పద్మజ, వెంకటేశ్వర్ రావు దంపతులు నివాసం ఉంటున్నారు. భార్య పద్మజపై గత కొన్ని రోజులుగా అనుమానం పెంచుకున్న వెంకటేశ్వర్ రావు తరచూ మద్యం సేవించి వచ్చి ఆమెపై దాడికి పాల్పడ్డాడు. ఆదివారం తెల్లవారుజామున భార్యతో గొడవ పడిన అతను సుత్తె తలపై మోదడంతో పద్మజ తీవ్రంగా గాయపడింది. కుటుంబసభ్యులలు ఆమెను చికిత్స నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఆమె పరిస్థితి విషమంగా ఉన్నట్లు పోలీసులు తెలిపారు. బాధితురాలు పద్మజ తల్లి సావిత్రమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు నిందితుడు వెంకటేశ్వర్ రావును అరెస్ట్ చేశారు.

రంజాన్ ఐక్యతకు నిదర్శనం



మంత్రి మహమూద్ అలీని సన్మానించిన జియాగూడ బీఆర్ఎస్ అధ్యక్షులు నరహరిచారి

జియాగూడ: రంజాన్ పండుగ హిందూ ముస్లింల ఐక్యతకు నిదర్శనమని తెలంగాణ రాష్ట్ర హోంమంత్రి మహమూద్ అలీ అన్నారు. ఆదివారం జియాగూడకు చెందిన బీఆర్ఎస్ నేతలు నరహరిచారి, శ్రీనివాస్‌గుప్తాలు మంత్రి మహమూద్ అలీని కలిసి ఘనంగా సన్మానించి రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా హోం మంత్రి మాట్లాడుతూ ముఖ్యమంత్రి కేసీఆర్ అన్నివర్గాల ప్రజల పండగలకు ప్రాధాన్యం ఇస్తున్నారన్నారు.